

## మహారాజా అని మనవి చేస్తే ...

'' ఉన్న సంగతెందుకు చెప్పాను? చెవిలోకి దూరినట్టే లేదు'' అని విచారిస్తూ, కూతుర్ని బుజానపడుకోబెట్టుకుని, దీపాల వేళ వంటింట్లో యిటూ అటూ తిరుగుతున్నది కాంతం. బెడ్ లైట్ వెలిగించి తళతళలాడే గ్లాసు అమర్చి గోడకున్న చిన్న మేకుకు గుచ్చింది బెడ్‌లైట్‌ని. ఆ యిల్లు కొత్తది. డాబా. ఇంకా విద్యుత్ శాంక్షన్ కాలేదు. వీధి దీపమే కిరోసిన్‌ది. మున్సిపల్ వర్కర్ దీపం వెలిగించి నూనె చూసి అద్దాల పంజరంలో అమర్చి వెళ్తాడు. తెల్లారేదాకా వెలుగుతుంది. తట్టలో కిరోసిన్ డబ్బా అగ్గిపెట్టె వుంటాయి. నిచ్చెన బుజాన వేసుకుని వెళ్తాడు సుబ్బన్న. వూరికి విద్యుత్ వచ్చింది గానీ యింకా అన్ని వీధులకీ రాలేదు. కొత్త యిళ్లకీ లేవు విద్యుత్ దీపాలు. ఆ యిల్లు వూరికి చివరగా మాగానికి దగ్గరగా వున్నది. అసలా వూరంతా మాగానే. జనాభా పెరిగి వూరు విస్తరించింది. ఉద్యోగాలూ డబ్బూ అందుతున్నాయి.

ఇంటి యజమానురాలు సత్యభామమ్మ దొడ్డివేపువచ్చి వాకిలికెదురుగా నిలబడింది. ''యేం కాంతమ్మా కూతుర్నెత్తుకుని వీపుమీద రాస్తున్నావు?'' ఆపేక్ష ఒలకబోస్తూ అడిగింది.

''యెప్పుడొచ్చారు పిన్నీ? వాకిట్లో బండి చప్పుడు కాలేదే!''

'' ఇపుడే వచ్చా స్టేషన్నించి. దీపం వెలిగిద్దామంటే అగ్గి పెట్టె కనబడలేదు. బాబాయిగారు చుట్టగానీ సిగరెట్టుగానీ తాగరు. అగ్గిపెట్టె యిస్తే దీపం వెలిగించి యిచ్చేస్తా. జ్వరం తాకిందా బిడ్డకి?''

''మరే పిన్నీ. జలుబూ జ్వరం తాకాయి. అమ్మా తలనెప్పి అంటూ కూలబడింది. కుంపటిమీద అత్తెసరు పెట్టాను. కూర తరగాలని కూచున్నా.'' అగ్గిపెట్టె అందించింది కాంతం.

''నేను గూడా వుడకేయాలి. ఇనప గరిటలో నిప్పు గూడా కిందబెట్టు. స్నానం జేసి వంటకుపక్రమించాలి. బెజవాడలోనూ జ్వరాలే. దోమలు, వేడి, వుక్క, కొద్ది వానబడినా నేల సెగలు కక్కుతున్నది. మా అన్నలేవటం లేదని వార్త అందితే వెళ్లాను. వచ్చేప్పటికి బాబాయి గారు తిరుపతి పండిత సభలకి వెళ్లారని, పక్కపాకలో కాపు రంగమ్మ తాళం చెవి అందించింది. నీకెందుకివ్వలేదో అనుకున్నాను. కజిన్ వస్తుందేమో, గెలవలేనని భయపడి తలుపు గడియపెట్టుకున్నావేమో అనుకున్నా'' అని నవ్వుతూ నిప్పు గరిట గూడా అందుకుని వెళ్లిపోయింది.

రెండు భాగాల డాబా. దక్షిణవేపు మూడుగదుల్లో యింటివారున్నారు. నలుగురు పిల్లలు. రెండవ వేపు హాలూ చిన్నగదీ. వరండా కామన్. దొడ్లో మంచి నీళ్ల బావి. చిన్న గదిలో చిన్న అడ్డుగోడ కట్టారు. కిచెన్. రెండోవేపు గోడకడితే బాత్‌రూమ్. మధ్య డైనింగ్ రూమ్. అల్మారాలున్నాయి.

మూడు నెలల అద్దె బయానా యిచ్చి చేరింది కాంతం. చిన్న బిడ్డలు యిద్దరూ తానూ అంతే.

యేం జరిగిందంటే, కాంతం పెళ్లి, గలాటా కొట్లాటా దెబ్బలాటా, తిట్లాటా చిత్రం తీసేందుకు అనువుగా జరిగినై. సూత్రధారణ తంతు జరగలేదు.'' పూర్తి కట్నం ముట్టలేదనీ, కానుకలూ, లాంఛనలూ అసలే లేవనీ, పిల్ల పేర పెడతానన్న మాగాని భూమి రిజిష్టర్ చేయలేదనీ యాగీ చేశారు మగపెళ్లి

వారు. పెళ్లి కొడుకుని తిట్టి కొట్టి, భాషికం పీకేసి, రెక్కలు పట్టుకు లేవదీసి లాక్కెళ్లి, పెళ్లిపందిరి వదిలివెళ్లి, రానూ పోనూ కుదుర్చుకు వచ్చిన బస్సులోకి, ఒకళ్లనొకళ్లు నెట్టుకుంటూ యెక్కి దూరి వెళ్లిపోయారు.

పెళ్లికూతురు తల్లి దుర్గమ్మ, వెళ్లిపోయిన వియ్యాలవారి కంటె యెక్కువ రాద్ధాంతం చేసింది. సీను వేసింది, కూతుర్ని తిట్టి, మొట్టి, బుగ్గలు గిల్లి, పెద్దరాగాలెడుతూ, తన వల్ల తప్పులేదని చాటుతూ, కిందబడి పొర్లింది.

''పారిపోం గదా పిన్నీ. నా తదనంతరం చెందేట్టు రాసియిస్తే చాలదుట. ఇపుడే పిల్లపేర పెట్టేయాలిట అత్తా. చేతికంది వచ్చిన చెట్టంత కొడుకూ పోతే సంసారం నెట్టుకొస్తున్న సంగతి తెలుసుగా వదినా. వెళ్లకని వారిస్తే విన్నదీగాదీ పెడకట్టె కూతురు. తీరా చేతులు కాలక అఘాయిత్యానికి తలపెట్టింది తెలివి తక్కువ దద్దమ్మ. వ్యవహర్తను గనక, నోట్లో నాలికున్నది గనక, నాలుగుర్నీ కూడ గట్టుకుని, చేసుకోరనీ మాకు వారికీ మధ్య పురాణ వైరమున్నదనీ గుర్తుండి గూడా, వెళ్లి కాళ్లావేళ్లా పడి, పచ్చుతాడు పడేట్టు చేద్దామని ఒప్పిస్తే యిలా అభాసు అయింది.''

కిందబడి పొర్లుతున్న దుర్గమ్మ వీపుమీద రాచారు ఆడపెళ్లివారు. అంతా అయినవాళ్లే. నోటిమీద చెయ్యివేసుకునీ, దవడలు నొక్కుకునీ నవ్వాపుకుంటూ ఓదార్చారు.'' యిపుడు కూతురు మీదికి నెట్టేసిందంతా గడసరి దుర్గమ్మ. దీనికి తెలియకుండానే జరిగిందా శోభనం! ముద్దుల కూతురికి మూడోమాసం'' అని దొంగ నవ్వు దొంగ చూపులూ చూసి తలలాడించారు.

దుర్గమ్మను బాగా సముదాయించి లేవదీసి, ''తప్పువారిదే దుర్గా. దేవుడు

లేడా! మేమంతా నీ పక్షమే. స్వంతగా రుచిగా వండిన భోజనం వదిలి వెళ్లారు. వారికి ప్రాప్తం లేదు. మనమే ఆరగిద్దాము.'' తీసికెళ్లి తామే విస్తళ్లేసి వడ్డన చేసి కడుపునిండా విందారగించారు.

2

కథకు ట్విస్ట్ వుంటేనే రక్తి గడుతుంది. కాలానికి పరుగెత్తే గుణమున్నది. యెవరి మీదా జాలీ మాలీ చూపదు. క్రైసిస్ వచ్చినా అంతే. మనకు కాలం స్తంభించిందా అని భ్రమ కలుగుతుంది. అది భ్రమే! కాలం పరుగెత్తుతూనే వుంటుంది. కలిమిలేములు, కష్టసుఖాలు, యెండా వానా వంటి ద్వంద్వాలకు అతీతమైంది కాలం. ఒక కవి కాలాన్ని దైవంతో పోల్చాడు. దైవం తన సృష్టిని చూసి ఆనందిస్తూ, వినోదిస్తూ, కాలగర్భంలో పుట్టి, కాలగర్భంలో కలిసిపోయే ప్రాణులను, జగత్తునూ చూస్తూ నిర్మోహి అయివుండును. అందుకే స్థాణూ అని పేరు. కాంతం తల్లి అయి బిడ్డను సాకుతూ, తన తల్లి ఆడే ఆట చూస్తూ అనే మాటలు వింటూ ప్రపంచజ్ఞానం పొందింది. సేల్స్‌గళ్, టైపిస్ట్, ప్రూఫ్ రీడర్‌లాంటి పార్ట్‌టైమ్ జాబ్స్, టెంపొరరీ జాబ్స్ చేస్తున్నది. అది కొత్తరకం అచ్చాపీసు, దానిని స్త్రీలే మానేజ్ చేస్తున్నారు. పబ్లికేషన్ సంస్థ నడుపుతున్నారు. టైలరింగ్ షాపులోనూ స్త్రీలే మెండ్ చేయటం, రంగు వేయటం, పూలు కుట్టటం, బొత్తాలూ, కాజాలూ, హుక్స్ అండ్ అయిస్ కుట్టటం చేస్తుంది కాంతం. నోరు మంచిదైతే వూరు మంచిదౌతుంది. కాలం పరుగెత్తి రెండున్నర సంవత్సరాలు వెనక్కి నెట్టింది.

నాగన్నను నర్సరీలో చేర్చింది. నర్సరీ నడుపుతున్న వనజకి వంట సాయం చేస్తుంది. వెచ్చాలు తెచ్చిపెడుతుంది. పిల్లలకి ఫీడింగ్ చూస్తుంది. అలా గడిచిపోతే

బాగుండు. కాని హఠాత్తుగా 'బోల్ట్ ఫ్రమ్‌ది బ్లూ' లాగా వెలిశాడు తన వారితో బస్సెక్కి వెళ్లిన మగడు రాజా.

'' ఒక్కత్తెవే కాపరం చేస్తున్నావేం కాంతా? వెతికీ వెతికీ, 'కనుగొంటినీ కాంతమ్మనూ నేడు' అని పాడుకుంటూ లోపలి కడుగిడితే, గంటసేపు వెతికాడని జాలిపడవు!'' అని సుందరంగా దరహాస చంద్రికలు విసురుతూ, తనను తానే మర్యాద చేసుకుంటూ కుర్చీలాక్కొచ్చి దాంట్లో కూచుని ప్లాస్టిక్‌సంచీ దానిలోని ఆటబొమ్మలనూ, బూట్లు మేజోళ్లనూ, రంగు పెన్సిళ్ల పెట్టెనూ కింద వుంచాడు. ''మళ్లా వెలిశారెందుకూ? ట్విస్ట్‌తో సహా చిత్రం అయిపాయెగా! కమర్షియల్ అండ్ థ్రిల్లర్ లాగా చిత్రం బాగున్నది. నా వైపు వారెట్టివారో అరేంజ్‌డ్ మారేజ్‌లో తెలిపాయెగా'' అని నవ్వుతూ, ''నోరూ వాయీ లేని బుడ్డోడైపాయె రాజా వారు. వారికి శాస్త్రీయమైన లావుపాటి తొమ్మిది పోగుల జంధ్యం అమిరిందనీ, కుర్ర నాగన్నగూడా ప్రపంచం చూసి ఆనందించాలని వచ్చాడనీ, దినపత్రికలో ఫ్రంట్ పేజీలో హెడ్‌లైన్స్‌తో సహా చిత్రం పడిందే. నౌవాటీజ్ ది ఐడియా?'' అని జోక్సు విసిరింది కాంతం.

రాజా నొచ్చుకోలేదు. 'పడి వుండచ్చు, నువ్వు చూసి వుండచ్చు కాంతా! కానీ కాలం శరవేగంతో పరుగెత్తింది. కాలం తీరిన వారిని తనతో తీసుకుపోయింది. అరేంజ్ చేసుకుని, శాస్త్రాన్ని గౌరవించి వచ్చిన భాగ్యలక్ష్మి టీ చేస్తూ స్టౌ మంటలకు నైలాన్ చీర అంటుకోగా గారంగా పెరిగిన అమ్మాయి గనక, కిందబడి పొర్లి ఆర్పు కోవాలనే సమయస్ఫూర్తి గూడా లేక యాక్సిడెంటుకు లోనై కాలగర్భంలో కలిసిపోయింది.'' కళ్లకింద చెంపలమీద నీరు కారుతున్నట్టు ముంజేతి షర్టుతో తుడుచుకున్నాడు రాజా.

''వెరీ సారీ వార్త అందలేదు దూరదర్శిని మీదా చూపలేదు'' అంటూ వెళ్లి, వేడి కాఫీ, ఛిప్సూ, బిస్కట్లు ట్రేలో పెట్టి తెచ్చి యెదురుగా బల్ల జరిపి దాని మీదుంచింది కాంతం. ఆ వేడి కాఫీ నెత్తిన పోయకుండా యెంతో మర్యాదగా యెదురుగా వుంచినందుకు రాజా చాలా సంతోషించాడు.

''నాగరాజుని వాడి అమ్మమ్మా తాతయ్యా తీసికెళ్లి లా ప్రకారం దత్తు చేసుకున్నారు. మా వాళ్లమీద కేసు బనాయించారు. గాస్ స్టౌ ఆన్ చేసి భాగ్యలక్ష్మిని టీ చేసి తెమ్మని పంపారుట కిచెన్‌లోకి. అది పథకం వేసిన మర్డర్‌ట. భాగ్యలక్ష్మి పేర ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసిన రెండు లక్షలు, మనమడు నాగరాజుకే చెందుతాయట. ఇల్లంతా కుళ్లగించి లాయరూ పోలీసూ సాయంతో భాగ్యలక్ష్మి నగలూ చీరలూ తీసుకుపోయారు. మరొక థ్రిల్లర్'' కాఫీ తాగుతూ అన్ని వేపులా చూస్తూ ఛిప్సు బిస్కట్సూ తింటున్నాడు రాజా.

''రాజా వారికి మరో సంబంధం వస్తుంది ష్యూర్ థింగ్. ఇక్కడ వెలవటమెందుకూ?'' అనడిగింది కాంతం నిలబడే.

''యెందుకంటే కాంతా! తంతు మూడొంతులైపోయిందిగా. రోప్ అంత ముఖ్యంగాదు. సరీగ్గా లగ్గం సమయానికి బెల్లం జీలకర్రా ముద్ద జేసి తమలపాకులో పెట్టి నెత్తిన పెట్టించగానే ముగిసినట్టే. మాంగల్యం ముఖ్యంగాదని పురోహితుడు పిచ్చయ్య చెప్పాడు. మరోటి వస్తే గుండె రాయి చేసుకుని తిరస్కరిస్తాలే కాంతా. నీ కాంతుని మీద మమకారం లేదా? సంతానమిచ్చానే! ముద్దులాడుతున్నావు. పెంచుతున్నావు కొడుకుని, రేపాకొడుకేం చేస్తాడో! అడ్డాలనాడు బిడ్డలు గాని గడ్డాలనాడు బిడ్డలా అని సామెత. నా ప్రశ్నకు నువ్వు సమాధాన మివ్వలేదు'' అని దీనాలాపాలాడి, దణ్ణాలు పెడతూ కాఫీ, ఛిప్సూ,

బిస్కట్లు పూర్తిచేసి మూతి తుడుచుకుని కాంతం వంక చూశాడు రాజా.

''నా కజిన్ భువన మోహినిని మీరు నమ్మించి ద్రోహం చేశారుట. చిన్ననాడె నా చేయి పట్టితివీ అని బాగా మరులుగొలిపి వలలో వేసుకున్నారు. నేను శూర్పణఖలాగా సీతారాములల్లే కాపరం వెలిగిస్తున్న మీ యిద్దరినీ విడదీశానుట.'' కాంతం నవ్వుతున్నది. ''కజిన్ మీ కోసం తపిస్తూ వెతుకుతున్నది. మీటై అన్యోన్య దాంపత్యం వెలిగించవచ్చు రాజా వారు. సదా మీ దరహాసం యెంజయ్ చేస్తుంది. ఆనందాబ్ధిలో ఓలలాడిస్తుంది.'' అని నవ్వుతున్నది కాంతం.

వెర్రి మొహం వేశాడు రాజా. కాని తేరుకున్నాడు.

''మైండ్ ఎఫెక్ట్ అయిందేమో నీ కజిన్‌కి! యేదో ఆలోచిస్తుండగా బాలెన్సు పోయిందేమో'' అన్నాడాలోచిస్తూ

''మీరు కావాల్సిన వారికి నిర్భయంగా పిల్లలనిస్తారుగదా. కజిన్ కి ముద్దుగా పెంచుకునేందుకు పిల్లలు కావాలిట. తానొచ్చి మీ కోసం యెదురుచూస్తూ విసుగెత్తి నన్ను వెళ్లిపొమ్మంది. ఒక్కత్తెనూ కాపరముండమన్నది.''

తేరుకున్న రాజా నవ్వుతున్నాడు ''నువ్వే కావాలి'' అనే చిత్రం చూశావా కాంతా? నేను మగాడినే సిగ్గరిని గాను. నాకూ హక్కున్నది'' లేచిపోయి తలుపు గడియ పెట్టి వచ్చి కాంతాన్ని వాటేసుకుని ముద్దులు కురిపిస్తూ, ''నాగన్నను చూపించవూ కాంతా! యెవరి పోలికో చూడాలని వున్నది'' అని లాక్కెళ్లాడు.

3

సత్యభామమ్మ కంట్రాక్టరు శాయిరామరాజుగారి చెల్లెలు. అన్నేమో

తనకూతుర్ని కంప్యూటర్ ఎకాడమీకి పంపుతున్నాడు మేనల్లుడు శాయిమోహన్. కోర్సు పూర్తి చేసి స్టేట్స్‌లో జాబ్ కొట్టాలని ట్రై చేస్తున్నాడు. టెంపొరరీ జాబ్ చేస్తున్నాడు. తరచూ మామయ్యను చూడబోతాడు. మామయ్య చుట్టూ తిరుగుతాడు. పని చెప్పగానే చేసి పెడతాడు. డ్రైవింగ్ నేర్చాడు. యే వాహనమైనా డ్రైవ్ చేస్తాడు. కూతుర్నివ్వాలని చూస్తున్నాడు కంట్రాక్టరు. ముద్దుల కూతురు అల్లునితో స్టేట్స్‌కి వెళ్తుంది. ముద్దుల చెల్లెలుకి సూచించాడు గూడాను. అదీ ఆమె గర్వకారణం.

భువన మోహిని వచ్చి నోటిదుడుకు, విరాళింపు చూపింది. ఆమెను మంచి మార్గాన పెట్టాలని కలగజేసుకున్నది.

''మోహినీ! మందు వేసుకోరాదూ? ఇవాళ నా చేత్తో యిస్తావేసుకో. హద్దు మీరి కజిన్ని మరీ కాల్చుకు తింటున్నావు. ఆడజన్మ యెత్తలేదూ? యెక్కడ దాచావే వాడిని కాంతా అని అడుగుతూ వస్తివి. ఇల్లెట్లా తెలిసింది? ఇక్కడికే యెందుకొచ్చావూ? రాజాగారున్న వూళ్లోనే వాళ్లింటికే వెళ్లక పోయావూ? కనుక్కోలేక పోయావా? నేను నమ్మను. తెలివిగలదానివేనే. బిడియమూ లేదనీ అర్థమైంది.'' అలా మెల్లిగా అంటూ పళ్లెంలో నాలుగు మాత్రలుంచి యెదురుగా పెట్టింది. గ్లాసుతో మజ్జిగ కింద వుంచింది సత్యభామమ్మ. వంటిట్లో నించి దొడ్లోకొచ్చింది.

''నువ్వే నా సత్యభామవి? మాకూ మాకూ చాలా వున్నాయి. స్కోర్ చేసుకోవాలి. నీ యిగో బైటికే కనబడుతున్నది. నీ పట్టుచీరా రైకా నా కంటికానవు. మేకకు పట్టుచీర కట్టి వెనక్కాళ్ల మీద నించో బెట్టినట్టున్నావు. కడుపుగూడానూ? మనమల్నెత్తుకునే వయసుగాదూ నీదీ? యేం వుద్యోగం నీ మొగుడికీ? భట్టీయం

వేసినవి సభలో వల్లిస్తాడా? యెంత ముట్టుతుందీ? ప్రతీ ఆడదీ తన వాడు ఏకపత్నీ వ్రతుడనుకుంటుంది. నువ్వూ అంతే. జనరల్స్ మీటింగ్ అనే కథ చదివావా? చాలా హ్యూమర్. ఒకడి యింటి దాన్ని మరొకడు అహోహ్! రంజుగా వుంది కథ. ప్రమోషన్ కోసం వైఫ్‌ని యిహిహీ! నువ్వా నన్ను దారిలో పెట్టేది. ఈ మాత్రలెక్కడివీ? కాంతం యిచ్చింది? నా మీద కొండేలు చాడీలు పితూరీలు చెప్పిందా? విషం పెట్టమన్నదా? నా సంగతెరగవ్ సత్యా! కుక్క వాసన బట్టినట్టు నేనిట్టే విషాన్ని వాసన బడతాను. ఉండు సత్యా! నీ చేతే యీ విషం మింగిస్తా'' అని లేచింది మోహిని. నాల్గు మాత్రలున్న పళ్లెం మజ్జిగ గ్లాసూ పట్టుకుని వస్తున్న మోహినిని చూసి ఆమె కళ్లలోని తీవ్రత చూసి భయపడి యింట్లోకి పోయి తలుపు గడియపెట్టుకున్నది సత్యభామమ్మ.

మోహిని మాత్రలను మంచినీళ్ల బావిలోకి విసిరేసింది. మజ్జిగ దారగా పోసింది. ఈ బావిలో నీళ్లు తాగిని వారు చస్తారు'' అని పెద్దగా నవ్వుతూ వెళ్లి, ''తలుపు తీయ్ సత్యా! దాక్కున్నావేం? తోక మడిచావేం? నన్ను మంచి మార్గంలో పెట్టవూ సత్యా!'' అని తలుపు మీద గట్టిగా బాదుతున్నది. ఆ అరుపులకు యిరుగు పొరుగూ వచ్చి మోహినిని బలవంతంగా నెట్టుకెళ్లి వాళ్ల భాగంలోకి నెట్టి బయట గొళ్ళెం పెట్టారు. లోపలనించి పెద్ద నవ్వూ తిట్లూ వినబడినై. వాళ్ల దోవన వాళ్లెళ్లారు. అలా రెండు రోజులు గడిచినై. మూడవరోజున నిశ్శబ్దంగా వున్నది.

కాంతం సబ్బునీళ్లల్లోంచి గుడ్డలు తీసి శుభ్రం చేస్తున్నది. సత్యభామమ్మ వచ్చి ద్వారబంధాలమీద చెయ్యి వేసి అన్నది. పొద్దువాటారుతున్నది.

'' ఇల్లు ఖాళీ చేయ్ కాంతమ్మా. ఇచ్చిన బయానా ముగిసింది. ఇల్లు అద్దెకు

కావాలనీ మూడొందలిస్తామనీ అర్నెల్ల బయానా కడ్తామని చేతబెట్టి వెళ్లారు. పొద్దునే పదిగంటలకి. ఇదుగో చూడు. నేనబద్ధమాడటం లేదు. చాల్లే సంబడం నీ కజిన్ హత్య చేయటానిక్కూడా జంకదేమో. కేసుబెట్టి హాస్పిటల్లోగానీ, జైల్లోగానీ పెట్టాలామెను. నిన్నా మొన్నా నోరు మూతపడలేదే. బాబాయి గారున్నారని వెరిచిందేమో. మొన్న రాత్రికి వచ్చారాయన. గట్టిదే కజిను. ఇవాళ నీ మొగుడిని పట్టాలని వచ్చింది. రేపు నా మొగుడినీ పట్టాలని చూడచ్చు. బొద్దుగా బంగారు ఛాయలో వుంటారు గదూ. ఓసారి అనుభవమైంది బాబాయి గారికి అయితే ఆ భువనసుందరిది వేరే కులం. పక్కన బాబాయిగారికి స్నేహితులున్నారు. యెంత అతిశయం యెంత అభిజాత్యం నీకజినుకి! ఆ దూషణలోనే వెల్లడౌతున్నది నైజం. నా కెందుకులే కాంతమ్మా. మీరు మీరూ తేల్చుకోండి. చెప్పిందిగా స్కోర్ చేసుకోవాలనీ. మా అన్న నన్ను తెమ్మని మనిషిని పంపాడు. కూతుర్నివ్వాలట. తాంబూలాలు పుచ్చుకోవాలిట. బయానా యిచ్చిన వాళ్లు రేపే వస్తారు. రేపు మంచిరోజట. బాబాయిగారేమో మేడవేయాలని మున్సిపల్ వారికి ప్లాన్ చూపి పర్మిషన్ తెచ్చారు'' అన్నది.

కాంతం గుడ్డలు పిండి బకెట్‌లో పడేసి నించున్నది.

''అలాగే పిన్ని! అంత అద్దే యివ్వలేను. బయానా అసలే కట్టలేను. నా టెంపొరరీ జాబూ యివాల్టితో ముగిసింది. నా కజినేమో మా వూళ్లో బాంకులో డబ్బు డ్రా చేసి తెచ్చుకోవాలనీ, అటునించి వాళ్ల వూరెల్లి రైతు యిచ్చే ఐవేజు తెచ్చుకోవాలనీ పొద్దున్నే వెళ్లింది. నేనీలోపలే వెళ్లిపోవాలి. స్లీపర్‌లో బెర్తు రిజర్వు చేయించుకు వచ్చా. యిబ్బందేమనగా, వున్న కొద్దిసామానూ అమ్మనన్నా అమ్మాలి లేదా దానమివ్వాలి. మీరు కొంటారా? యెంతొస్తే అంతే యివ్వండి'' అన్నది

నిదానంగా.

''దానమివ్వట మెందుకూ? అన్నీ కొత్త పాత్రలు. నేకొంటారా. ధరవేసి కూడి డబ్బు యిప్పుడే యిస్తాను. పద చూద్దాం''.

4

ఒక వృద్ధ దంపతులు మెడిటేషన్ సెంటర్ అని నడుపుతూ నిర్గుణోపాసన నేర్పుతూ సోషల్ వర్క్ చేస్తున్నారు. తెలియలేరు రామభక్తి మార్గమునూ అని పాడుకుంటారు. వృద్ధురాలి కుడిచేతికి హీలింగ్ శక్తి వున్నది. రైల్లో వాళ్లతో పరిచయమై కాంతం వాళ్ల వెంట వెళ్లింది. మెడిటేషన్ నేర్చి నిర్గుణుడు, నిరాకారుడు, నిత్యునీ రెండు పూట్లా మెడిటేట్ చేసింది. కడకనిత్యుని తెలియమియేటికి? మెతుకుల కొరకిచ్చుకమేటికి. నిను సేవింపని పుట్టుకయేటికీ ఈశా అనే పాట నేర్చుకున్నది. ఆదరించినవారికి అపార్ట్‌మెంట్స్ ఫ్లాట్సు వున్నాయి. అద్దె కలెక్టు చేసి తెచ్చిస్తుంది. రిపేర్లు చేయాల్సి వస్తే చేయిస్తుంది. పాలపాట్లాల పంపకం యేజన్సీ యిప్పించారు. వన్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్ యిచ్చారు. నాగన్ననీ, నాగమణినీ బళ్లో దింపి వస్తుంది కాంతం. భవానీ స్కూల్ దాని పేరు.

ఆ రోజు ఆదివారం. సాయంకాలం. పాలపంపకం త్వరగా ముగిసి బేసిమెంట్ నించి పైకి వచ్చేసింది కాంతం. టైం కలిసి రావాలని రెండు పూట్లకీ వండేస్తుంది. కుర్చీలో కూచుని వుమన్ అండ్ హోమ్ అనే మాసపత్రిక చూస్తున్నది. స్వెట్టర్ అల్లిక వివరాలు చదువుతున్నది.

పిల్లలిద్దరూ బొమ్మల పుస్తకాల్లోని బొమ్మలకు రంగులేస్తున్నారు. కాలింగ్

బెల్ మోగింది. నాగన్న వెళ్లి గొలుసుతీసి తలుపు తీశాడు. యెదురుగా రాజా ఫుల్‌సూటులో పక్కనే భువన మోహినీ పట్టుచీరా రవిక జుట్టు ముడేసుకున్నది చేతులో సంచీ. నాగన్న వెనక్కి వచ్చేశాడు. వాళ్లిద్దరూ చొరవగా లోపలికొచ్చి ఖాళీ పేము కుర్చీలాక్రమించారు. రాజా నవ్వుతున్నాడు. మోహిని కులుకుతూ సిగ్గు నభినయిస్తున్నది.

కాంతం కళ్లప్పగించింది. రాజాయే నిశ్శబ్దం ఛేదించాడు.

''పిల్లి తన పిల్లలను యేడిళ్లు మారుస్తుందట. అలాగా మళ్లీ మారావే కాంతా? మొదట పుట్టిల్లు వదిలావు. తరవాత అద్దె యిల్లు. అంత సులభంగా యెలా మారతావు? యిల్లెలా దొరుకుతుంది? ఇక్కడ ఉద్యోగాలు హాండీగా వున్నాయా? మంచి నీళ్ల బావి, పైరుగాలీ మట్టసమైన భాగం వదిలి వచ్చావే కాంతా! వాటీజ్ ది ఐడియా?''

''ఇంటామె ఖాళీ చేయమన్నది. మేడ వేసుకుంటారట. యెక్కువ రెంట్ యిస్తామని మూడునెలల రెంట్ బయానా యిచ్చి వెళ్ళారుట. డబ్బు చూసింది. మరునాడే కావాలన్నది యింటామె'' అన్నదిగానీ లాభం లేదని తెలిసి కజిన్ చేసిన గలాటా చెప్పలేదు.

'' ఒక్కొక్కరినే అడుగుతూ పోతే, మీ అమ్మ వచ్చి డబ్బు నొల్లుకు పోతుందని, ఆమెకు నీ పతా తెలుసుననీ అంటే, ఆ పనీ కానిచ్చి, యెలాగైతేనేం నిన్ను పట్టాను. నీ కజిన్ ట్రబుల్ షూటరైంది. మా యింటి కెళ్లి మా వాళ్లకు బాగా టోకరా వేసింది. వాళ్లు నమ్మారు. నేను రాగానే నన్ను పట్టించారు నీ కజిన్‌కి. క్షణం వదలదు, చెప్పేది వినిపించుకోదు'' అంటున్నాడు.

‘‘నీకు జరిగినంతవరకే నాకూ తంతు జరిగింది. తంతు నమ్మవేమోనని తెచ్చానిదుగో చూడు’’ అని సంచీలోంచి తమలపాకూ దానిమీద జీలకర్ర కలిపిన తాజా ముద్దా చూపింది మోహిని. ‘‘నేనూ భార్యనే. నీకున్న హక్కు నాకూ వున్నది. నేనిప్పుడు కజిన్ను గాదు. సవితిని’’ అని విరగబడి నవ్వింది మోహిని. రాజు వంక చూసింది. ‘‘నువ్వు నాకు డైవోర్సు యివ్వలేవు’’ యింకా నవ్వింది.

రాజా మొహాన బాధేం లేదు. మళ్లా అన్నాడు.

‘‘మాయమాటలు చెప్పి, మీరిద్దరూ కలిసివుంటే మంచిదని నీ డబ్బు కాంతా డబ్బు వాడుకుంటూ వుండాలి. నువ్వూ సిటీ యెంజాయ్ చేయచ్చని వూరించాను. నాకు సింగపూర్లో వుద్యోగం వచ్చింది. పెద్ద జీతం. నేను వెళ్లి స్థిరపడి డబ్బు పంపుతాను. కొంత టైం కావాలి. కాంతా! నీకు పుణ్యముంటుంది. మోహినికూ్కడా పొద్దుబోయేందుకు జాబ్ చూపించు. నువ్వు హెల్ప్ చేయాలి. చేయకపోతే మోహిని నా వెంటబడుతుంది’’ అంటున్నాడు రాజా.

‘‘వెంట యెందుకు పడతానంటే కంతూ! రాజాకి మరో సంబంధం స్థిరపడపోతున్నది. కలవారే. బ్రైడ్ బిజినస్ రన్ చేస్తున్నది. దాని నాశ్రయించుకుని వుండి వ్యాపారం నడపాలి. దానికి న్యూ మోడల్ కారున్నది. డ్రైవర్‌గా గూడా వాడుకుంటుంది బాడీ గార్డ్. కొట్లో దొంగతనం జరక్కుండా సెక్యూరిటీ ఆఫీసర్ రాజా. అదంతా భ్రమ అని చూపిస్తాను. ప్రాక్టికల్‌గా చూపుతా. ఇక్కడకి నిన్నూ పిల్లల్నీ చూడటానికి వస్తాడు. నేనూ యిక్కడే వుంటే నేనూ కనచ్చని ప్లాన్ వేసి వచ్చాను. తెలివి ఒకరి సొమ్మా తీసుపెట్టుకోటానికి! నా తెలివితేటలు చూపాను’’ పకపకా నవ్వుతున్నది మోహిని.

కాంతం శాంతంగా చూస్తూ అన్నది ''మరొక సామెత వున్నది మీకు తెలుసా?'' రాజానే అడిగింది.

తన కజిన్ని వుండనీయబోతున్నదని ఆశతో చూస్తూ రాజా అడిగాడు ''యేమిటది కాంతా?''

''మహారాజా అని మనవిచేస్తే మరొకటి తన్నమన్నాడట'' నవ్వటానికి ప్రయత్నిస్తూ చెప్పింది కాంతం.

❋❋❋❋